# నీలాగ ఎందరో...

ఉలిక్కిపడి నిద్రలేచాడు కైలాసం.

తన నిద్రని భంగపరిచిందెవరు.... ఎవరు....?

"గుర్ .... గుర్ .... గుర్ ...."

ఏంటా శబ్దం.... కుక్కా? పందా?.... ఆఫీసుల్లోకి కుక్కలూ పందులూ కూడా వచ్చేస్తున్నాయా?

పక్కకి తిరిగి చూశాడు.

ఆ శబ్దం చేస్తుంది పక్కసీట్లోని పైకుంఠం. గురకపెట్టి నిద్రపోతున్నాడు.

కైలాసానికి చిర్రెత్తుకొచ్చింది. చివాలున సీట్లోంచి లేచి వైకుంఠం భుజాలు పట్టి కుదిపిలేపాడు.

వైకుంఠం కళ్ళు నులుముకుంటూ ఆవలించాడు.

"ఎందుకు లేపావ్?"

"లేపక?.... నన్నూరికే డిస్టర్బెన్స్ చేస్తే ఊరుకుంటానా?"

వైకుంఠం నాలుకొక్కరుక్కని చెంపలేసుక్కున్నాడు.

"సారీ గురూ— నువ్వు పంజేస్తున్నావని నాకు తెలీదు...."

కైలాసం ఘొల్లున నవ్వాడు.

"పనా?.... నేనా?.... నేనెప్పుడైనా పంజెయ్యడం నువ్వు చూశావా?"

వైకుంఠం కైలాసం వంక ఆశ్చర్యంగా చూశాడు.

"పోయినాదివారం మీ ఇంటికి వచ్చినప్పుడు పప్పు రుబ్బడం చూశాను—అంతకు ముందాదివారం వరండాలో కూర్చుని బియ్యం ఏరడం చూశాను.... ఆపై ఆదివారం—"


"నోర్ముయ్— నేనంటున్నది ఇంట్లో పని గురించి కాదు.... ఆఫీసు పనిగురించి...."

వైకుంఠం
నాలుక్కొరుక్కున్నాడు—

“సారీరా.... నిన్నపార్థం చేసుకున్నా— సరేగానీ పనేం చెయ డంలేదుగా.... డిస్టర్బెన్స్ అంటావేం?”

“నీ గురకవల్ల నా నిద్ర పాడయింది.... గురక తియ్యకుం నిద్రపోలేవూ?....”

“సారీరా కైలాసం.... నెమ్మదిగా గుర్రెడతాలే....” అంట టేబులుమీద తల వాల్చేశాడు వైకుంఠం.




“నిద్రపోయిందిక చాల్లేగానీ.... అలా బయటికి వెళ్దాం.... ప ఎంతసేపని ఆఫీసులో ఇలా సీట్లకతుక్కుని నిద్రపోతాం....” అన్నా కైలాసం విసుగ్గా.

“అలాగే పద—” వైకుంఠం సీట్లోంచి లేచాడు.

“ఇద్దరూ మేనేజర్ దగ్గరికి వెళ్ళేరు.”

“సార్....” అన్నారు ఇద్దరూ.

“గుర్— గుర్ — గుర్ —”

"సార్ —" కాస్త గట్టిగా పిలిచాడు.

"అబ్బ ఏంటయ్యా?" మేనేజరు కళ్ళు తెరిచి విసుక్కున్నాడు.

"మేం కాస్త బయటికి వెళ్తున్నాం.... పర్మిషను అడగడానికి వొచ్చాం.

"అలాగే"

"మళ్ళీ ఆఫీసుకి వస్తే వస్తాం లేకపోతే అట్నుండి అటు ఇంటికి వెళ్ళిపోతాం...."

"అలాగే — గుర్ — గుర్ — గుర్ —"

ఇద్దరూ బయటపడ్డారు.

"నిన్నట్నుండీ ఒక్కమ్మాయినీ ఏడిపించలేకపోవడంతో ఒళ్ళంతా ఎలా తీటగా ఉంది...." అన్నాడు కైలాసం.

"నాక్కూడా అలానే ఒళ్ళంతా జింజిం అంటుంది —" అన్నాడు వైకుంఠం.

"జింజిం అనడం అంటే?" కైలాసం వింతగా చూశాడు.

"అదే నువ్వు తీటగా అన్నావే— అలాంటిదే జింజిం అంటే—"

వైకుంఠం సిగ్గుపడ్డాడు.

కైలాసం వైకుంఠం భుజం తట్టి మెచ్చుకున్నాడు.

ఇద్దరూ బస్టాండుకి వెళ్ళి నిల్చున్నారు.

వైకుంఠం అటూ ఇటూ చూశాడు అమ్మాయిల కోసం. బస్సు క్యూలో చివరగా ఒకర్తె నిల్చుని ఉంది స్కూలుబ్యాగ్ భుజానికి తగిలించుకుని.

వైకుంఠం కైలాసం మోచేతిమీద గోకాడు.

కైలాసం వెనక్కి తిరిగాడు.

"ఇక్కడ...." అన్నాడు.

"ఏంటి?—" ఆశ్చర్యంగా అడిగాడు వైకుంఠం.

"వీపుమీద గోకు — దురదగా వుంది—"

వైకుంఠం విసుక్కున్నాడు.

"నేను గోకుతుంది నాకు దురదగా ఉందని కాదు. అటు చూడు_" అన్నాడు వైకుంఠం అమ్మాయి వంక చూపిస్తూ.

"ఏముందక్కడ?"

"ఆఫీసులోని నిద్రమత్తు నాకింకా వదిలినట్టు లేదు.... హు...." నొసలుమీద కొట్టుకుంటూ "నా వెనకాల రా...." అంటూ ముందుకు అడుగులు వేశాడు.

కైలాసం వైకుంటాన్ని అనుసరించాడు?

వైకుంఠం ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళి ఏమీ ఎరగనివాడిలా పక్కన నిల్చున్నాడు. కైలాసం వైకుంఠం పక్కన నిల్చున్నాడు.

వైకుంఠం మెల్లి మెల్లిగా పక్కకి జరుగుతూ ఆ అమ్మాయికి తగిలేలా నుంచున్నాడు. ఆ అమ్మాయి వైకుంఠంవంక చూసింది. వైకుంఠం అటూ ఇటూ దిక్కులు చూసి ఆ అమ్మాయి చేతిని మెల్లిగా గిల్లాడు.

మరుక్షణంలో___

"కెవ్వ్___" గావుకేక పెట్టాడు వైకుంఠం.

"ఏంటి?.... ఏమైంది?...." కైలాసం కంగారుగా అడిగాడు.

వైకుంఠం చెయ్యెత్తి ఊదుకుంటూ అన్నాడు.

"తొక్క రేగిపోయింది _ ఆ అమ్మాయి కూడా గిల్లింది _" కైలాసం చెవులో సంబరంగా అన్నాడు.

"హిహిహి___" అంటూ నవ్వింది ఆ అమ్మాయి.

తరువాత ఆ అమ్మాయివంక తిరిగి కన్ను కొట్టాడు వైకుంఠం.

ఆ అమ్మాయి కూడా సర్దాపడుతూ కన్నుకొట్టి "హిహిహి _"అని నవ్వింది.

"నేను కన్నుకొడ్తే ఆ అమ్మాయి కూడా కన్ను కొట్టింది...." కైలాసం చెవులో సంతోషంగా అన్నాడు వైకుంఠం.

కైలాసం ఆ అమ్మాయి వంక చూశాడు.

ఆ అమ్మాయి కైలాసానికి కూడా సంబరంగా కన్ను కొట్టి "హిహిహి _" అంది.

6)

కైలాసం వైకుంఠంమీద మండిపడ్డాడు.

"చేసిన నిర్వాకం ఇహ చాల్లే.... ఏ వయసువాళ్ళకి ఫోజుకొట్టాలో ఎలా కొట్టాలో కూడా తెలీదు — పద సుల్తాన్ బజారెళ్దాం —" అంటూ వైకుంఠం రెక్క పుచ్చుకుని అక్కడినుండి లాక్కెళ్ళాడు.

"టాటా అంకుల్ —" అంది ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ళ ఆ అమ్మాయి గాల్లోకి ఫ్లయింగ్ కిస్ వదుల్తూ.

ఇద్దరూ సుల్తాన్ బజార్ చేరుకున్నారు.

"ఇహ మనం ఈ చివర్నుండి ఆ చివరిదాకా.... ఆ చివర్నుండి ఈ చివరిదాకా వయసులో వున్న అమ్మాయిలందరికీ టకటకా డ్యాష్లు కొట్టుకుంటూ వెళ్ళాలన్నమాట.... అలాగైతే ఒంటికి పట్టిన తీట వదుల్తుంది" అన్నాడు కైలాసం.

"నా ఒంటి జిల్ జిల్ కూడా వదులుతుంది —" అన్నాడు చంకలు గుద్దుకుంటూ వైకుంఠం.

ఇద్దరూ సుల్తాన్‌బజారులో అటూ ఇటూ తిరుగుతూ అందరికీ డ్యాష్ కొట్టసాగారు. వీలున్నప్పుడల్లా వారబాట్న వీళ్ళవంక ఏ అమ్మాయైనా చూస్తే కన్నుకొట్టి పళ్ళికిలించసాగారు.

"కాస్సేపయ్యాక వైకుంఠంవైపు ఒకమ్మాయి చూసింది ఏదో ఆలోచిస్తూ.

అంతే.... వైకుంఠం ఆ అమ్మాయి వెంటపడిపోయాడు. కైలాసం వైకుంఠం వెనకాలే ఫాలో అయ్యాడు.

"ఏయ్ అమ్మాయ్ —" వైకుంఠం వెనకనుండి ఆ అమ్మాయిని మెల్లగా పిల్చాడు. ఆ అమ్మాయి వెనక్కి తిరిగి చూసింది. వైకుంఠం టకీమని కన్నుకొట్టాడు..

"నన్ను కూడా చూడు.... నన్ను కూడా చూడు...." అన్నాడు కైలాసం.

ఆ అమ్మాయి కైలాసం వంక కూడా చూసింది. కైలాసం టకీటకీమని కళ్ళు మార్చిమార్చి కొట్టాడు.

"హం...." అని అనుకుంటూ ఆ అమ్మాయి తల గిర్రున తిప్పేసి ముందుకు అడుగులు వేసింది.

వీళ్ళిద్దరూ మళ్ళీ ఫాలో అయ్యారు.

"చెయ్యి పట్టుకో.... చెయ్యి పట్టుకో—" కైలాసం వైకుంఠం చెవిలో గొణిగాడు.

వైకుంఠం వెనకనుండి ఆ అమ్మాయి చెయ్యి పట్టుకున్నాడు.

ఆ అమ్మాయి గిరుక్కున వెనక్కి తిరిగి వైకుంఠం ముఖంమీద ఉమ్మేసి "బ్లడీఫూల్....రాస్కెల్...." అని తిట్టి చరచరా వెళ్ళిపోయింది

వైకుంఠం ముఖం పాలిపోయింది.

"అదేంటోయ్." అలా గైపోయావ్. మనలాంటి వాళ్ళకి సిగ్గూశరం ఉండకూడదు. మరీ కొత్తాడిలా బిహేవ్ చేస్తావేం?.... ఛీరప్" అన్నాడు కైలాసం.

వైకుంఠం ఒక్కపెట్టున ఘొల్లున నవ్వి ముఖానికి వున్న ఉమ్మని సరదాగా తుడిచేసుకున్నాడు.

"పద — మన ప్రోగ్రాం కంటిన్యూ చేద్దాం —" అని ఉత్సాహంగా అడుగులు ముందుకు వేశాడు.

కాస్సేపయ్యాక వైకుంఠం ఒకమ్మాయిని వెనకనుండి జడ పట్టుకుని లాగాడు.

ఆ అమ్మాయి గిరుక్కున వెనక్కి తిరిగింది.

"నీ యవ్వ — దొంగలం నీ.... నీ — నీ ... నీ...." వరస బెట్టి బూతులు తిడుతూ కాలికున్న పైరుచెప్పు తీసింది.

ఇద్దరూ కాలికి బుద్ధి చెప్పారు.

"మరీ ఇంత అమాయకుడివైతే ఎలానోయ్?.... నువ్వు క్లాస్‌గర్ల్స్ జోలికి వెళ్ళగానీ ఇలాంటి లేబర్ క్లాస్ అమ్మాయిల జోలికి వస్తే వెళ్ళకు ఎప్పుడూ" అన్నాడు కైలాసం కాస్తదూరం పరుగెత్తాక ఆగి వగరుస్తూ.

"మరి ఇలా తిడుతుందని నాకేం తెల్సు?" ఆయాసపడుతూ అన్నాడు వైకుంఠం.

"ఇలా రోడ్డుమీద కంటే సినిమాహాల్లో.... ఆ చీకట్లో చాలా గమ్మత్తులు చెయ్యొచ్చు.... పద మ్యాట్నీకి టైమయింది —"

ఇద్దరూ ఓ సినిమాకి వెళ్ళారు. వీళ్ళు వెళ్ళేసరికే ఆట మొదలైంది హాల్లో చీకట్లో తడుముకుంటూ ఒకచోట కూర్చున్నారు.

కళ్ళు చీకటి మెల్లమెల్లగా అలవాటైన తరువాత వీళ్ళ ముందులైన్లో ఒక స్త్రీ ఆకారం ఒక్కర్తి కూర్చుని ఉండడం కనిపించింది.

"హాయ్.... మనం చాలా లక్కీ.... ఎవర్తో ఒకర్తే వచ్చింది—"

"సినిమాకి ఒక్కర్తే వచ్చిందంటే తప్పకుండా కేసే అయ్యుంటుంది ఇలా ఒక్కరే వచ్చి సినిమాకి వచ్చిన ఎవడ్నో ఒకడ్ని బుక్ చేసుకు పోతారు. ఊ — ప్రొసీడ్" అన్నాడు కైలాసం వైకుంఠం చెవిలో ఉత్సాహంగా.

వైకుంఠం వెనకనుండి మెల్లగా ఆమె భుజాలమీద చేతులువేశాడు. ఆమె ఇబ్బందిగా పక్కకి జరిగింది. ఈ పక్కనుండి కైలాసం చెయ్యేశాడు. గత్యంతరం లేక ఆమె ముందుకి జరిగింది. అప్పుడు వైకుంఠం కాల్తో నొక్కాడు. కైలాసం కూడా కాల్తో నొక్కాడు.

ఆమె అక్కడినుండి లేచివెళ్ళి వేరేసీట్లో కూర్చుంది, వీళ్ళిద్దరూ మళ్ళీ లేచి వెళ్ళి ఆమె వెనకాల సీట్లో కూర్చున్నారు. మళ్ళీ ఇద్దరూ కాళ్ళూచేతులూ వెయ్యడంమొదలుబెట్టారు. వైకుంఠం మధ్యమధ్య ఆమెతో బూతులు అనసాగాడు.

ఇంతలో ఇంటర్వెల్ అయింది. హాల్లో లైట్లు వెలిగాయ్. ఆలైట్ల వెలుగులో ఆమెని చూసిన కైలాసం కొయ్యబారిపోయాడు.

ఆమె ఎవరో కాదు.... తన భార్యే....

చీకటి — దానికితోడు ఎప్పుడూ లేనిది జడ బదులు ముడి వేసుకోవడంవల్ల వెనకనుండి భార్యని గుర్తుపట్టలేకపోయాడు కైలాసం.